
రాంనగర్‌లో నిర్వహించిన వినాయక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు


జిల్లాకేంద్రంలో ప్రతిష్ఠించిన వినాయకుడి ప్రతిమకు పూజలు చేస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు


అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయుడి ప్రతిమకు పూజలు చేసిన నాయకులు


పాత పాలమూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ జానకి, పోలీసులు

ఉండ్రాలయ్యా.. దీవించయ్యా

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలు
- భిన్నరీతిలో మండపాల ఏర్పాటు, అలంకరణ
- లంబోదరుడి ప్రతిమల ప్రతిష్ఠాపనలు, ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్: వినాయక చవితి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా బుధ, గురువారాల్లో మండపాల నిర్వాహకులు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధి వీధిన మండపాలను ఏర్పాటు చేసి భిన్నరీతుల్లో అలంకరించారు. వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఉండ్రాల పాయసం, గుగ్గిళ్లను నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులు చెల్లించుకొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమకు అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, ఎస్పీకార్యాలయంలో ఏర్పాటు చేసిన సురక్ష గణనాథుడికి డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి, క్లాక్‌టవర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి ప్రతిమకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకేంద్రంలోని బొడ్రాయి చౌరస్తాలో వినాయక యువజన సంఘం ఏర్పాటు చేసిన ప్రతిమకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్చర్లలోని బాబీస్ట్రీట్‌లో మార్వాడిసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మండపంలో ఎస్పీ జానకి పూజలు చేశారు. గండేడ్ మండలం వెన్నాచేడ్ శివాలయంలో శివగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. భూత్పూర్, నవాబుపేట, జడ్చర్ల, మిడ్జిల్, హన్వాడ, గండేడ్, మహమ్మదాబాద్, దేవరకద్ర, చిన్నచింతకుంట, అడ్డాకుల, మూసాపేట, మహబూబ్‌నగర్ రూరల్, నగరంలో ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

■ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జిల్లాకేంద్రంలో ప్రతిష్ఠించిన వినాయక మండపాలను సందర్శించి గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు.


గాధీర్యాల్‌లో వినాయకుడికి పూజులు చేస్తున్న భక్తులు


ఎస్పీ కార్యాలయంలో పూజలు చేస్తున్న డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్


కలెక్టరేట్‌లో పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్


చౌదర్‌పల్లిలో ప్రతిష్ఠించిన వినాయకుడు


బ్రాహ్మణవాడిలో భక్త యువజన సంఘం గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


వెన్నాచేడ్‌లో పూజలు చేస్తున్న భక్తులు


మూసాపేటలో పూజలు చేస్తున్న భక్తులు


జడ్చర్లలోని వీరశివాజీనగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి పూజలు చేస్తున్న నిర్వాహకులు


దేవరకద్రలో గుండు గణపతికి పూజలు చేస్తున్న భక్తులు


బండ్లగేరిలో ప్రతిష్ఠించిన వినాయకుడు


అమిస్తాపూర్‌లో పూజలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

అర్ధరాత్రి రోడ్డుపై చెట్ల తొలగింపు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షంతో పట్టణ శివారులోని మయూరి పార్క్ వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లు విరిగి 167 జాతీయ రహదారిపై పడ్డాయి. అర్ధరాత్రి పైగా వర్షం పడుతున్న క్రమంలో చెట్లు రోడ్డుపై ఉండడంతో మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలు, జడ్చర్ల వైపు నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చే వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కావడంతో ప్రయాణికులు ఎస్పీ జానకికి ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ఆదేశాల మేరకు ఏఆర్ పోలీస్ బలగాలు వేగవంతంగా స్పందించాయి. ప్రత్యేక బృందం అక్కడికి చేరుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

అలరించిన టీఎల్‌ఎం మేళా



మిడ్జిల్: ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా తరగతి గదుల్లో బోధించే అంశాలపై గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని వివిధ అంశాలపై ప్రయోగాలను ప్రదర్శించారు. ప్రయోగాలను కలెక్టర్ విజయేందిరబోయి పరిశీలించారు. ప్రతి ప్రయోగం వివరాలను క్షుణ్ణంగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంతో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ యాపీరాజు, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ ఆనంద్, ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎంలు సుధాకర్, సరస్వతి,, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

నాతే షరీఫ్ పోటీలు అభినందనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: 40 ఏళ్ల నుంచి అంజుమనే ఫైజానే షర్ఫియా ఆధ్వర్యంలో రబీలవల్ మాసంలో 12రోజులపాటు నాతే షరీఫ్ పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ధార్మిక వేత్త హజ్రత్ సయ్యద్‌షా ఆలే ముస్తఫా ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని షాసాబ్‌గుట్టలోగల హజ్రత్ మర్దాన్‌అలీషా మజీద్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన నాతే షరీఫ్ పోటీల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 90మంది నాతేషరీఫ్‌లను ఆలపించగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మర్దాన్‌అలీషా దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షా ఖాద్రీ, అఫ్రోజ్‌షా ఖాద్రీ, ముఫ్తి మహ్మద్ ఇఫ్తెకార్ అహ్మద్, అంజుమనే ఫైజానే షర్ఫియా తదితరులు పాల్గొన్నారు.

మండపాల్లో బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలను బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలతో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులకు సెక్యూరిటీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, మండపం దగ్గర నిత్యం సభ్యులు ఒకరు ఉండాలని సూచించారు. ప్రధానంగా రాత్రివేళ జాగ్రత్తలు పాటించాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ర్యాగింగ్, డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ అప్పయ్య మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రగ్స్ వాడకం, విక్రయాలు చేయడం చట్ట ప్రకారం నేరమన్నారు. విద్యార్థులు ఎవరూ గంజాయి, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పద లింక్‌లు, ఫేక్‌కాల్స్ నమ్మరాదన్నారు.

బల్సూర్‌గొండలో నల్లచెరువుకు గండి

- సకాలంలో స్పందించిన అధికారులు, పోలీసులు
- ముప్పు తప్పడంతో గ్రామస్తుల హర్షం


బల్సూర్‌గొండ నల్లచెరువుకు మరమ్మతు చేస్తున్న అధికారులు

గండేడ్: తూము పక్కన చెరువుకు గండి పడడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, పోలీసులు సకాలంలో స్పందించడంతో ముప్పు తప్పింది. మండలంలోని బల్సూర్‌గొండ నల్లచెరువు ఊరిని ఆనుకొని ఉంది. దాదాపు 50ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు నిండి అలుగు పారిది. మంగళవారం అర్ధరాత్రి తూము పక్కన సన్న రంధ్రం పడి నీరు కారసాగింది. అదే సమయంలో రాత్రి ఎస్సై శేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. నీరు లీకవుతుండడాన్ని గుర్తించి అదే సమయంలో ఇసుక బస్తాలు వేయించారు. లీకేజీ పూర్తిగా తగ్గకపోవడంతో బుధవారం తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ లక్ష్మయ్య కలిసి మళ్లీ లీకేజీ పరిశీలించారు. లీకేజీ కారణంగా కట్టలోపల మొత్తం మెత్తగా అయి ప్రమాదకరంగా మారింది. చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు గడ్డి తొలగించి మరోమారు లీకేజీ పెరగకుండా అరికట్టేందుకు ఇసుక బస్తాలు వేసి పేర్చారు. దీంతో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి జేసీబీతో మట్టి వేయించారు. గ్రామస్తులు కూడా కలిసికట్టుగా సహకరించారు. దీంతో లీకేజీ నిలిచిపోయింది. పంచాయతీ కార్యదర్శి శిరీష లీకేజీ పనులను పర్యవేక్షించారు. అధికారులు సకాలంలో స్పందించి మరమ్మతు చేపట్టడంతో పెద్ద ముప్పు తప్పడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

జడ్చర్ల టౌన్: జీపీ ఎన్నికల సన్నాహకంలో భాగంగా గురువారం మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ముసాయిదా ఓటరు జాబితాను కార్యదర్శులు నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే శనివారంలోగా లిఖిత పూర్వకంగా జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేయాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలియజేశారు. మండలంలో మొత్తం 45జీలుండగా.. 376 వార్డులున్నాయి. వీటిలో 40, 862మంది ఓటర్లు ఉండగా పురుషులు 20, 081, మహిళలు 20,780మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో మహిళా ఓటర్లు 699 అధికంగా ఉండడం గమనార్హం. 200 ఓట్ల కన్నా తక్కువగా 21 జీపీలు ఉండగా 201 ఓటర్ల కన్నా ఎక్కువగా 23 జీపీలున్నాయి. 2జీపీల్లో 400 ఓటర్లకన్నా అధికంగా ఉన్నారు. అత్యల్పంగా శంకరాయపల్లి తండా పంచాయతీలో కేవలం 66మంది ఓటర్లు ఉన్నారు. శంకరాయపల్లి తండా పంచాయతీ అయినప్పటికీ మున్సిపాలిటీలో విలీనం కాగా శంకరాయపల్లి మాత్రమే పంచాయతీగా మారింది. ఆ గ్రామంలో 90మంది జనాభా ఉండగా అందరూ ఒకే కులానికి చెందినవారు కావడం గమనార్హం.


నవాబుపేటలో ప్రకటిస్తున్న మండల అధికారులు

ఓటర్ల జాబితా ప్రకటన

నవాబుపేట: మండలంలోని 54 జీపీల్లో వార్డులవారీగా ఓటర్ల జాబితాను ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. అభ్యంతరాలు అధికారులకు తెలియజేయాలన్నారు. మండల స్థాయిలో 30న సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చేనెల 2న తుది జాబితాను ప్రకటిస్తామని వివరించారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

జడ్చర్ల: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని ఈర్లపల్లి తండాకు చెందిన రైతు విస్లావత్ రవి కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని భారతీయ కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్ తదితరులు డిమాండ్ చేశారు. బుధవారం రైతు కుటుబాన్ని వారు పరామర్శించారు. రూ.50 లక్షలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

టీపీఆర్టీయూ అధ్యక్షుడిగా శాంసుందర్‌రెడ్డి

నవాబుపేట: పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా శాంసుందర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భూపతిసింగ్, రాష్ట్ర బాధ్యుడు రమాకాంత్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఎన్నికల్లో సంఘం ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, మహిళ అధ్యక్షురాలిగా సరోజ, కోశాధికారిగా భీంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడుగా చంద్రమోహన్, ఉపాధ్యక్షుడిగా మహేశ్‌కుమార్, అంధుధతి తదితరులను ఎన్నుకున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

నవాబుపేట: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు మండలంలోని యన్మన్‌గండ్ల జెడ్పీ పాఠశాల విద్యార్థి ఎంపికైయ్యాడు. ఈ విషయాన్ని గురువారం పాఠశాల పీఈటీ మేరీపుష్ప ప్రకటించారు. యన్మన్‌గండ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి వి.శివ షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. కాగా ఈ పోటీలు ఈనెల 30నుంచి 31వ తేదీవరకు పాలమూర్ యూనివర్సిటీలో జరుగుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని మండల అధికారులు, ఉపాధ్యాయ బృందాలు అభినందించారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సెలఫోన్‌లకు దూరంగా ఉండాలని డాక్టర్ ప్రతిభ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రేయిన్‌బో పాఠశాలలో గురువారం పిల్లలు లైంగిక వేధింపులు అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యుక్త వయస్సులో ఉండే పిల్లలు కంటికి ఏది కనిపిస్తే వాటికి ఆకర్షితులవుతారని, ఫోన్‌లో ఇంటర్నెట్ వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని వాటిని దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై తల్లిదండ్రులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేశ్ పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలి

దేవరకద్ర రూరల్: వెంకటగిరి–వెంకంపల్లి మార్గన ఉన్న రోడ్డును బాగు చేయాలని కోరుతూ గురువారం వెంకటగిరి గ్రామస్తులు కౌకుంట్ల తహసీల్దార్ సుందర్ రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ వెంకటగిరి దగ్గర ఉన్న 83వ రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురు అవుతున్నాయి. రహదారిని వెంటనే బాగుచేయాలని కోరారు.

హాస్టల్ విద్యార్థులకు చేయూత

నవాబుపేట: విధి నిర్వహణలో భాగంగా ఎస్‌ఐ విక్రమ్ గురువారం యన్మన్‌గండ్లలో పర్యటిస్తుండగా.. హాస్టల్ విద్యార్థులు వర్షానికి రోడ్డుపై చెప్పుల్లేకుండా నడవడం చూసి చలించిపోయాడు. హాస్టల్ వార్డెన్ ప్రవీణ్‌రెడ్డికి ఫోన్ చేసి చెప్పుల్లేని విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని చెప్పులతోపాటు క్రీడా సామగ్రిని అందజేశారు. దీంతో ఎస్‌ఐని విద్యార్థులు, వార్డెన్ అభినందించారు.

లారీ అసోసియేషన్‌లో లొల్లి: పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల: లారీ అసోసియేషన్‌లో గురువారం లొల్లి చోటుచేసుకుంది. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కార్యవర్గం పదవీ కాలం ముగిసినందున నూతన కమిటీని ఎన్నుకోవాలని తీర్మానించారు. పాత కార్యవర్గంలో ఉన్నవారే తమకు తాముగా ఒకరిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ఏకపక్షంగా ప్రకటించుకుని సన్మానించుకున్నారని, వారిని వ్యతిరేకిస్తున్నవారు ఆరోపించారు. ఓటుహక్కు ద్వారా ఎన్నిక నిర్వహించేందుకు సహకరించాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతేగాక ఏకపక్షంగా అధ్యక్ష పదవిని ప్రకటించుకున్న వారికి ప్రస్తుతం కనీసంగా ఓటు హక్కు లేదని, వారికి లారీలు కూడా లేవన్నారు. లారీ యజమానులకు మాత్రమే అసోసియేషన్‌లో ఓటుహక్కు ఉంటుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, ఖైసర్, మాజీ ఉపాధ్యక్షులు కుమార్‌గౌడ్, మతిన్, అల్మాస్, సుభాన్, బాల్‌రాజ్, ఖుర్షీద్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబ్‌నగర్ అధ్యక్షుడు సుదర్శన్‌యాదవ్ తన జన్మదినం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలో దాదాపు 50మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడంతోపాటు అల్పాహారం అందజేశారు. సుదర్శన్‌యాదవ్‌ను పలువురు ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో లయన్ నటరాజ్, అశోక్ కుమార్ యాదవ్, గోవర్ధన్, ప్రసాద్, రుద్రోజీరావు, రాములు, చిన్నయ్య, నాగరాజు, మోహన్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆత్మహత్యాయత్నం



గండేడ్: టర్పంటైల్ ఒంటిపై పోసుకుని ఓ మహిళా ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా.. మండలంలోని వెన్నాచేడ్‌కు చెందిన బాగాయిపల్లిబాబు, భార్య రేణుక ఉదయం 7:45 గంటల ప్రాంతంలో చిన్నగా ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన రేణుక ఇంట్లో ఉన్న టర్పంటైల్ ఒంటిపై పోసుకొని నిప్పటించుకుంది. గమనించిన భర్త బాబు మంటలు ఆర్పాడు. తక్షణమే 108కు సమాచారం ఇవ్వగా.. అంబులెన్సులో ఈఎంటి జానమ్మ, పైలేట్ అక్బర్ బాధితురాలికి చికిత్స చేశారు. అనంతరం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

వామపక్ష పార్టీల పోరాట ఫలితమే ఉచిత విద్యుత్



మహబూబ్‌నగర్ న్యూటౌన్: 25సంవత్సరాల క్రితం 9వామపక్ష పార్టీలు చేసిన పోరాట ఫలితమే నేటి ఉచిత విద్యుత్ అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లెగోపాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడి, శ్రామికుల కష్టార్జితంతో ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించారని, బ్యాంకు సంస్కరణల్లో భాగంగా విద్యుత్‌రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేసిందన్నారు. ప్రపంచ బ్యాంకుతో ఒప్పందం కారణంగా నాటి ప్రభుత్వం చార్జీలు పెంచేందుకు చేసుకున్న ఒప్పందాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన వామపక్ష పార్టీల కారణంగానే ఉచిత విద్యుత్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, ప్రశాంత్, ప్రవీణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కష్టం.. ఇంతింత కాదయా

- ఉదయం 4గంటలకే దుకాణాలకు చేరుకున్న రైతులు
- టోకెన్లు ఇచ్చి పంపిణీ చేసిన నిర్వాహకులు

మహమ్మదాబాద్/భూత్పూర్/అడ్డాల/దేవరకద్ర: యూరియా కష్టాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. అవసరానికి దొరుకుద్దో లేదోనని ఉదయం 4గంటలకే ఎరువుల దుకాణాలకు చేరుకుంటున్నారు. అప్పటినుంచి యూరియా లోడ్ వచ్చే వరకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఒకేఒక్క లోడు రావడంతో దుకాణాల యజమానులు ముందు వచ్చినవారికి టోకెన్లు ఇచ్చి పంపిణీ చేయించారు. దీంతో ఒక్కసారిగా లారీకి ఎగబడడంతో వచ్చిన బస్తాలు లెక్కలేకుండా తీసుకెళ్తారన్న ఆందోళన మొదలైంది. ఉదయం 11గంటల వరకు రైతులు యూరియా కోసం వచ్చి గంటల తరబడి పడిగాపులుగాసి వెళ్లిపోయారు. ఏఓ నరేందర్‌ను వివరణ కోరగా.. ఇప్పివరకు 60శాతం యూరియా పంపిణీ చేశామని, ఉన్నతాధికారులకు తెలిపి మరో 300 టన్నులు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

■ భూత్పూర్ పట్టణంలోని శ్రీనివాస్ ట్రేడర్స్, రైతు ఆగ్రో సేవా కేంద్రంను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. రెండు దుకాణాల్లో 27 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా వచ్చినట్లు కలెక్టర్ గుర్తించారు. ఆన్‌లైన్ ఈపాస్ యంత్రం ద్వారా సరఫరా , ఓ టీపీ ని జనరేట్ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. సాంకేతిక సమస్యలు, సర్వర్ స్లోగా వస్తుందని డీలర్లు కలెక్టర్‌కు వివరించారు. అంతకుముందు మిడ్జిల్ సింగిల్‌విండో కార్యాలయం వద్ద యూరియా పంపిణీని పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.

■ జడ్చర్ల మార్కెట్ యార్డు ప్రాంతంలోని దుకాణాల వద్ద రైతులు బారులుదీరారు. మధ్యాహ్నం వరకు పడిగాపులు కాశారు. నిర్వాహకులు స్టాకు ఉన్నంత వరకు యూరియాను విక్రయించడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు.


మహమ్మదాబాద్‌లో యూరియా కోసం ఎగబడ్డ రైతులు


మిడ్జిల్ పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

■ దేవరకద్రలోని రాయిచూర్ రోడ్డులోని రైతుసేవా కేంద్రానికి ఒకలారీ, నాగారం పీఏసీఎస్‌కు ఒకలారీ యూరియాను కేటాయించగా.. ఒక్కో రైతుకు 2బస్తాలు ఇవ్వడంతో గంటలోనే అయిపోయింది.

■ మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ఉదయం నుంచి రైతులు బారులుదీరారు. వరుసలో చెప్పులను ఉంచి అక్కడే పడిగాపులు కాశారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. తర్వాత ఏఓ అనిల్‌కుమార్ కార్యాలయానికి చేరుకుని యూరియాను పంపిణీ చేశారు.

■ కొకుంట్ల మండలం అప్పంపల్లి పీఏసీఎస్ వద్ద కూడా రైతులు చెప్పులను క్యూలైన్లో ఉంచారు. 300 బస్తాల యూరియా రావడంతో రైతుకు 2సంచుల చొప్పున అధికారులు పంపిణీ చేశారు.


మూసాపేటలో ఏఓతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి